మే జిక్...

సైన్స్ కాలేజీ స్టూడెంట్స్ బొటానికల్ టూర్‌కి అరకువేలీ వెళ్ళారు. అక్కడ ప్రకృతి సౌందర్యాన్నంతటినీ తనివితీరా చూసిన తరువాత మొక్కల మీదకు దండెత్తి కనిపించిన మొక్కలన్నింటినీ శల్య పరీక్షలు చేసి కుల గోత్ర జాతి మత విభేదాలు చేసి అలసి సొలసి అంతా కలసి ఓ చోట లాన్‌లో కూలబడ్డారు.

"చిరునవ్వులు కురిసే
అమ్మాయి కళ్ళు
చేసే సిరి వెన్నెల మేజిక్"

# ఆమె కళ్ళు

— యన్నాకుల రమేష్



పేరుకు బొటానికల్ టూర్ అయినా...ఎంత సేపూ ఆ మొక్కలను పరీక్షిస్తూ గడపాలంటే ఎవరికైనా బాధగానే వుంటుంది. అందుకే కాసేపు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఏదైనా ఆట ఆడాలని అందరూ అనుకున్నారు.

"నేను...మిస్...కారుణ్య కలసి ఒక మ్యాజిక్ చేస్తాం..." అన్నాడు నందన్.

"ఏమిటా మ్యాజిక్?" అడిగారొకరు.

"మీకు కనిపించనంత దూరానికి నేను వెళ్ళిపోతాను. తరువాత మీరు ఏదైనా ఒక వస్తువు పేరు కారుణ్యకు చెప్పండి. తరువాత కారుణ్య నన్ను అడిగే వస్తువులలో మీరు చెప్పిన వస్తువేమిటో నేను కనుక్కుంటాను" అన్నాడు నందన్.

"హవ్ ఈజ్ యిట్ పాజిబుల్?"

"అదే మ్యాజిక్..."

"ఫన్నీ గేమ్...తొందరగా స్టార్ట్ చేయండి"

అక్కడ నుండి దూరంగా వెళ్ళి అవతలవైపుకు తిరిగి నిల్చున్నాడు నందన్. గుంపుగా చేరిన విద్యార్థినీ విద్యార్థులంతా గుసగుసలాడుకొని కారుణ్య చెవిలో తాము అనుకున్న వస్తువు చేమంతిపువ్వు అని చెప్పారు.

నందన్ తిరిగి వాళ్ళ దగ్గరకు వచ్చాడు.

కారుణ్య ప్రశ్నలడగడం ప్రారంభించింది.

"మువ్వ బాంగిల్స్"

"నో..."

"రోజ్ ఫ్లవర్"

"నో"

"బాటనీ రికార్డ్..."

"నో"

"కాకి"

"నో"

"చేమంతి పువ్వు"

"ఎస్..."

ఆనందాతిరేకంతో చప్పట్లు చరుస్తూ బిగ్గరగా కేకలు వేసారు అందరు.

"వావ్...ఫెంటాస్టిక్...మరోసారి చేయండి" అన్నారు.

ఈమారు నందన్‌ని గుంపులో కూర్చోపెట్టి తను లేచి దూరంగా వెళ్ళింది కారుణ్య.

ఈసారి కారుణ్య కట్టుకున్న 'శారీ' అనుకున్నారు.

కారుణ్యను వెనుకకు పిలిచి ప్రశ్నలడగసాగాడు నందన్.

"రాధ చేతులు"

"నో"

"పద్మిని పెదవులు"

"నో"

"సుప్రియ హెయిర్"

"నో"

"నీ శారీ..."

"ఎస్..."

అందరూ దిగ్భ్రమ చెందారు.

"హేయ్...హేయ్...వెరీ ఫన్నీ..."

"యింటరెస్టింగ్ టూ..."

"కాని...యిదెలా సాధ్యం?"

"ఐ థింక్ దేరీజ్ సమ్ కోడ్..."

"లెటజ్ ఎంజాయ్ ది గేమ్ ఎగైన్"

మ్యాజిక్ ప్రదర్శన మళ్ళీ మొదలేసారు..

అందులో దాగిన మర్మం గురించి ఒక్కొక్కరు ఒక్కో విధంగా వూహించి చెబుతున్నారు. కాని...ఏ ఒక్కరి వూహ కూడా నిజం కావడం లేదు.

"ఇక మా వల్ల కాదు. ఆ మర్మం ఏమిటో చెప్పి పుణ్యం కట్టుకోండి...ప్లీజ్" స్టూడెంట్స్ అంతా వాళ్ళిద్దరినీ చుట్టుముట్టారు.

ఇక చెప్పకపోతే వీళ్ళంతా తమ యిరువురినీ ఘెరావ్ చేసేలా వున్నారని ఆ మ్యాజిక్‌లో దాగిన మర్మం ఏమిటో వివరించింది కారుణ్య.

ఆమె చెప్పిన విషయం విని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ తరువాత సరదాగా నవ్వేశారు.

"నిజమే. ఈ మ్యాజిక్ వెరీ సింపుల్. కాని... ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా ఈ విషయమే మాకు తట్టలేదు" అన్నారు కొందరు.

కారుణ్య వివరించిన మ్యాజిక్‌లోని మర్మం-

"ఈ మ్యాజిక్‌లో 'నలుపురంగు' కోడ్‌గా ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఏ వస్తువునైతే అనుకుంటామో ఆ వస్తువును అడిగే ముందు 'నలుపురంగు' వస్తువేదైనా అడగాలి. అంటే నలుపురంగు వస్తువు అడడగానే ఆ తరువాత అడిగే వస్తువే అక్కడ వున్న గుంపు అనుకున్న వస్తువని జవాబు చెప్పే వ్యక్తికి తెలిసిపోతుంది. ఇంతకు ముందు అడిగిన ప్రశ్నలలో కాకి తరువాత చేమంతి పువ్వు వచ్చింది. అలాగే సుప్రియ హెయిర్ తరువాత కారుణ్య శారీ వచ్చింది."